# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 308 | పేజీలు: 4 | వెల: 4/- | శనివారం ● 18, మే 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## జలసంరక్షణ అందరి బాధ్యత

**- మంత్రి శ్రీధర్ బాబు**

**సిటీ బ్యూరో,మే17(నమస్తే ఉదయం):** జల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు అన్నారు. జలసంరక్షణకు ప్రాధాన్యమిస్తూ నీటి వృథాను అరికట్టేలా నిర్మాణాలు ఉండాలన్నారు. హై దరాబాద్ లో జరుగుతున్న ఐజీబీసీ గ్రీన్ ప్రాపర్టీ షో లో ఈపీటీఆర్ఐతో కలిసి జలమండలి సంయుక్తంగా ఏర్పాటు చేసిన స్టాల్‌ను వారు సందర్శించారు. ఇంకుడు గుంతల నిర్మాణం కోసం జలమండలి రూపొందించిన బ్రోచర్ ను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఇంకుడు గుంతల ప్రత్యేకాధికారి జాల సత్యనారాయణ, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వం మరచిన తనయులు

- ఆస్తి పంపకాల్లో తేడాతో రెండ్రోజులు
- తల్లి దహన సంస్కారాలు నిలిపివేత
- చివరకు పంచాయితీ తెగడంతో దహనం
- సూర్యాపేట జిల్లాలో కలచివేసిన ఘటన

**సూర్యాపేట,మే17(నమస్తే ఉదయం):** మానవత్వం మంట కలిసిపోతుంది. మానవ సంబంధాలు, విలువలు రోజు రోజుకు దిగజారుతూ అంతరించిపోతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య ఒకప్పుడు ప్రేమానురాగాలు ఉండేవి. రాను రాను

మిగతా.. 2లో



- సచివాలయంలో సిఎం రేవంత్ అధ్యక్షతన సమావేశం
- రుణమాఫీ, విభజన అంశాలతో పాటు పలు సమస్యలపై చర్చ

## నేడు తెలంగాణ
# కేబినేట్ భేటీ

**హైదరాబాద్,మే17(నమస్తే ఉదయం):** కొద్ది రోజుల విరామం తరవాత తెలంగాణ మంత్రి వర్గం శనివారం సమావేశం అవుతోంది. పార్లమెంట్ ఎన్నిక లనేపథ్యంలో ప్రభుత్వ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. కోడ్ కారణంగా ఏ పనీ చేయలేక పోయారు. ఎన్నికలు ముగియడంతో ఇప్పుడు సిఎం రేవంత్, మంత్రులు సచివాలయం నుంచి తమ విధులను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో శనివారం రాష్ట్ర కేబినేట్ సమావేశం జరగనుంది. ఇందులో ప్రధానంగా రైతుల రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్ర పునర్విభజన జరిగి పదేండ్లు పూర్తి కానుండటంతో పునర్విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్నవి, తెలంగాణ, ఏపీ మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై కేబినేట్‌లో చర్చించనున్నారు. . ఉద్యోగులు, ఆస్తులు, అప్పుల విభజనపై నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్.. ఇప్పటికే అధికారులను ఆదేశించారు. రెండు రాష్ట్రాల సయోధ్యతో ఉద్యోగుల బదిలీ సమస్యను పరిష్కరించాలన్నారు సీఎం రేవంత్. క్లిష్టమైన అంశాలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా కార్యాచరణ ఉండాలని అనుకుంటున్నారు. దీనికి సంబంధించి కేబినెట్ లో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అలాగే ఆగస్ట్ 15లోపు రైతుల రుణమాఫీ చేసి తీరాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన నిధుల సమీకరణపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. తెలంగాణలో దాదాపు 40 లక్షల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. రూ. 2 లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీని కోసం రూ. 34 వేల కోట్ల వరకు నిధులు అవసరం అవుతాయని అంచనా. రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తాయన్న దానిపై రేవంత్‌కు క్లారిటీ ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అనుకుంటున్నారు. ఆ దిశగా నిర్ణయాలు తీసుకునే

మిగతా.. 2లో



## మెదక్ బిఆర్ఎస్ అభ్యర్థిని డిస్‌క్వాలిఫై చేయాలి

- వెంకట్రామి రెడ్డి బహిరంగంగా డబ్బులు పంచారు
- సిఇవో వికాస్ రాజుకు రఘునందన్ ఫిర్యాదు

**హైదరాబాద్,మే17(నమస్తే ఉదయం):** లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని డిస్‌క్వాలిఫై చేయాలని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావు సీఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తెలంగాణ సీఈఓ వికాస్ రాజ్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించాశారు. ఈ ఎన్నికల్లో ఒక్కో ఓటర్‌కు ఆయన రూ. 500లు పంపిణీ చేశారని ఆరోపించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్థానిక పోలీసులు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు కట్టి ఎన్వలప్ కవర్‌లలో ఒక్కో గ్రామానికి డబ్బులు పంపిణీ చేశారని చెప్పారు. 20కి పైగా కార్లు ఉన్నాయని ఫిర్యాదు చేస్తే చేగుంట ఎస్ఐ ఒక్క కారును పట్టుకున్నారని.. అందులో డబ్బులు దొరికాయని అన్నారు. సీపీ సిద్దిపేట, ఎస్పీ మెదక్‌కు సరైన ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు.ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో హరీష్ రావు, మరో ఆరుగురు ఎమ్మెల్యేలు డబ్బుల పంపిణీ చేశారని ఆరోపించారు. రూ. 84లక్షలు 27 పోలింగ్ బూత్‌లకు పంపిణీ చేసే డబ్బులు ఒక్క కారులో దొరికాయని ఆరోపణలు చేశారు. రూ. 84లక్షల డబ్బులను ఃఖా అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఖాతాలో వేసి డిస్‌క్వాల్ఫి చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఇంకా బీఆర్ఎస్ అధికారంలో ఉందని పోలీసులు అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. ఇక్కడ న్యాయం జరగకపోతే ఢిల్లీకి పోయి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఎఫ్ఐఆర్‌లో వెంకట్రామిరెడ్డిని +5గా చేర్చారని.. ఈ విషయాన్ని ఎలక్షన్ కమిషన్ గుర్తించాలని రఘునందన్ రావు తెలిపారు.




## ధాన్యం కొనుగోళ్లలో రేవంత్ సర్కార్ విఫలం

- మంత్రి ఉత్తమ్ వెంటనే రాజీనామా చేయాలి
- బిజెపి ఎమ్మెల్యే ఏలేటి డిమాండ్

**హైదరాబాద్,మే17(నమస్తే ఉదయం):** కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేసారు. శుక్రవారం బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ సర్కార్ బోగస్ ప్రభుత్వంగా మారిపోయిందని విమర్శలు గుప్పించారు. వడ్లు కొనుగోలులో సీఎం రేవంత్ సర్కార్ విఫలమైందన్నారు. ఎప్పుడు

మిగతా.. 2లో





## రాజకీయాలకూ ఓ హద్దు ఉండాల్సిందే!

- సుప్రీం నిర్ణయాన్ని తప్పు పట్టడం దారుణం
- న్యాయవ్యవస్థను రాజకీయాల్లోకి లాగరాదు
- కేజ్రీవాల్‌కు బెయిల్‌పై షా వ్యాఖ్యలు అనుచితం

**న్యూఢిల్లీ,మే17(నమస్తే ఉదయం):** జకీయాల్లో అధికారమే అంతిమ లక్ష్యంగా రాజకీయ పార్టీలు అన్నీ పని చేస్తున్నాయి. ఇందుకు ఏ పార్టీ కూడా అతీతం కాదు. విభిన్నంగా ఎదిగిన బిజెపి కూడా ఇప్పుడు అధికారమే లక్ష్యంగా పనిచేస్తోంది. అన్నా హజారే మద్దతులో అవినీతి వ్యతిరేకతే అంశంగా రాజకీయాల్లో అడుగు పెట్టిన ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ కూడా తన మూలాలను మరచిపోయారు. అవినీతి కాంగ్రెస్ అంటూ విమర్శించిన కేజ్రీవాల్ ఇప్పుడు అదే కూటమి లో చేరిపోవడమే గాకుండా...ఇండియా కూటమి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారు. అంతేకాదు లిక్కర్ కేసులో జైలుకు వెళ్లారు.

మిగతా.. 2లో



## అమేథీ నుంచే రాజకీయ ఓనమాలు

- తనకు ఈ ప్రాంతంతో విడదీయరాని అనుబంధం
- అమేథీతోనే ఉన్నాను..ఉంటాను కూడా
- ఎన్నికల ప్రచారంలో రాహుల్ ఉద్వేగం

**అమేథీ,మే17(నమస్తే ఉదయం):** కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ అమేథీపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అమేథీ నుంచే తాను రాజకీయాలు నేర్చుకున్నానని, తాను వారితోనే ఉన్నానని,

మిగతా.. 2లో



## విజయవాడ హైవేపై తరచూ రోడ్డు ప్రమాదాలు

- 17 బ్లాక్ స్పాట్స్ గర్తించిన అధికారులు
- ప్రమాదాల నివారణపై మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

**హైదరాబాద్,మే17(నమస్తే ఉదయం):** హైదరాబాద్ - విజయవాడ హైవేపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. ఆ స్థాయిలోనే ప్రమాదాలూ జరుగుతుండటం అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. హైదరాబాద్ - విజయవాడ హైవేపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్న 17 బ్లాక్ స్పాట్స్‌ని అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ప్రమాదాలను తగ్గించే అంశంపై డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి

మిగతా.. 2లో

## కవితపై రాజకీయ
# దురుద్దేశ్యంతో కేసులు

- ఆమె ధైర్యంగా ఉన్నారన్న ప్రవీణ్ కుమార్
- ఉదయం తీహార్ జైలులో కవితతో భేటీ

**న్యూఢిల్లీ,మే17(నమస్తే ఉదయం):** లిక్కర్ స్కామ్‌లో అరెస్టై జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో బీఆర్ఎస్ నేతలు ములాఖత్ అయ్యారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్ పది గంటలకు తీహార్ జైలుకు వెళ్లి ఆమెతో మాట్లాడారు. జైలులో కవితతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్...' కవిత చాలా ధైర్యంగా ఉన్నారు. నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటాననే నమ్మకంతో ఉన్నారు. రాజకీయ దురుద్దేశంతో పెట్టిన కేసులని లాయర్‌కి నోటీసులు ఇవ్వకుండా సీబీఐ అరెస్టు చేసిరంటేనే ఎంత దారుణంగా ఉన్నారో అర్థం అవుతుంది. రాత్రికి రాత్రి జడ్జిని మార్చారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవడానికి ఆ ప్రభుత్వాలు పాలసీలు రూపొందిస్తారు, అందులో ఉన్నవాళ్ళందరిని దోషులుగా చేరుస్తామంటే ఎలా?. రైతు చట్టాలు సహా అనేక పాలసీలు మోడీ తీసుకొచ్చారు. అవి ఎవరి ప్రయోజనాలకోసం తీసుకొచ్చారని అన్నారు. కవిత దగ్గర నుంచి ఒక్క రూపాయి డబ్బు దొరక్కుండా పీఎంఎల్ఏ ఎలా వర్తిస్తుందని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. లంచం డిమాండ్ చేసినట్లు ఆధారాలు లేవని... అవినీతి నిరోధక చట్టం ప్రకారం సీబీఐ ఎలా అరెస్ట్ చేస్తారని నిలదీశారు. వాళ్ళ పేర్లు, వీళ్లా పేర్లు చెప్పండి అంటూ కవితపై అధికారులు ఒత్తిడి తెస్తున్నట్లుగా కవిత చెప్పారు. ఈడీ దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. బీజేపీ లో చేరినవారిపై ఒకలా, చేరనివారిపై మరోలా సెలెక్టివ్ గా ఈడీ



వ్యవహరిస్తోంది. విపక్షాల గొంతు నొక్కేందుకు సీబీఐ, ఈడీ ని బీజేపీ వాడుకుంటుంది. బాల్క సుమన్ మాట్లాడుతూ... 'కవిత మానసికంగా బలంగా ఉన్నారు. విపక్ష నాయకులను అణిచివేయలనే అన్యాయంగా కవితను ఈకేసులో ఇరికించారు. న్యాయస్థానలపై నమ్మకం ఉంది, న్యాయం జరుగుతుందనే ఆశాభావంతో ఉన్నారు. బీజేపీకి ఎవరు ఎదురు ఉండకూడదనే ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేసింది. ఢిల్లీ లిక్కర్ కేసు కేసే కాదు, అదొక పాలసీ... దాన్ని బూచిగా చూపించి తెలంగాణలో

మిగతా.. 2లో



## మేం హ్యాట్రిక్ విజయం
# సాధించబోతున్నాం..

- ఇండియా కూటమి బలహీనతే మా బలం
- రామాలయాన్ని బుల్‌డోజర్లతో కూలుస్తామంటున్నారు
- అలాంటి వారికి ఓటర్లు బుద్ధి చెప్పాలి
- బుల్‌డోజర్ల ఉపయోగం యోగి నుంచి తెలుసుకోవాలి
- యూపి ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు

**లక్నో,మే17(నమస్తే ఉదయం):** రాయబరేలి ప్రజలు ప్రధానిని ఎన్నుకుంటారంటూ కాంగ్రెస్ నేత ఒకరు చెప్పడాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం 'హ్యాట్రిక్' సాధించి తీరుతుందని అన్నారు. ప్రజలు అభివృద్ధికి పట్టం కడతారని అన్నారు. 'ఇండియా' కూటమి నేతలు ఒక్కొక్కరే జారుకుంటున్నారని అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ

మిగతా.. 2లో

# నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

మొదటిపేజీ తరువాయి..

అవకాశం ఉంది. ధాన్యం కొనుగోళ్ల పురోగతిని సమీక్షించి, వచ్చే ఖరీఫ్ పంటల ప్రణాళికపై చర్చ జరుగనుంది. రాష్ట్ర ఆదాయం పెంచుకునే దిశగా వనరుల సమీకరణ, ఆదాయ పెంపు ప్రత్యామ్నాయాలపై కేబినేట్ లో చర్చిస్తారు. కుంగిపోయిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల రిపేర్లకు సంబంధించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇటీవలే మధ్యంతర నివేదికను సమర్పించింది. నివేదికలోని సిఫారసులు, తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. జూన్ నుంచి కొత్త విద్యాసంవత్సరం ఆరంభమవుతుంది. స్కూల్, కాలేజీల ప్రారంభానికి ముందే అవసరమైన సన్నాహక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. విద్యార్థుల నమోదు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ల పంపిణీ తదితర అంశాలను చర్చించనున్నారు. అలాగే కార్పోరేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపైనా చర్చించే అవకాశం ఉంది. గత ప్రభుత్వం హయాంలో ఈ విషయంలో అస్సలు పట్టించుకోలేదు.

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వంద రోజుల పాలన అనంతరం ఎన్నికల కోడ్ వచ్చింది. ఈ వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలను హడావుడిగా అమలు చేశారు. ఆ పథకాల అమలు తీరుపైనా కేబినెట్ లో చర్చించే అవకాశాలు ఉన్నాయి. లోటు పాట్లు ఉంటే సరిదిద్దుకునేందుకు చర్చించనున్నారు. అలాగే నెరవేర్చాల్సిన హామీలు.. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు.. లోక్ సభ ఎన్నికల పోలింగ్ సరళిపైనా మంత్రులతో .. కేబినెట్ భేటీ అనంతరం రేవంత్ చర్చించే అవకాశం ఉంది.

# ధాన్యం కొనుగోళ్లలో రేవంత్ సర్కార్ విఫలం

మొదటిపేజీ తరువాయి..

పడిపోతుందో.. తెలియని ప్రభుత్వాన్ని రేవంత్ నడుపు తున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. తాము కాంగ్రెస్‌తో కాదు.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలే బీజేపీతో టచ్‌లో ఉన్నారన్నారు. సివిల్ సప్లైల శాఖామంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి విఫలమన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేయించలేని ఉత్తమ్.. మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తమ్‌కు రైతాంగ సమస్యలపై అవగాహన లేదన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్, జగ్గారెడ్డి మాటలకు జవాబు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. వడ్ల కొనుగోలులో రైస్ మిల్లర్లు రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. రైస్ మిల్లర్లు రైతులను బెదిరించటాన్ని ఖండిస్తున్నామన్నారు. ఎన్నికలు అయ్యాక.. సన్న బియ్యానికి మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామనటం అన్యాయమని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వరి ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి రివ్యూ చేస్తున్నా ఫలితాలు రావడం లేదన్నారు. గన్నీ బ్యాగుల విషయంలో కావాలని కొరత సృష్టిస్తున్నారని మండిపడ్డారు. వర్షాలతో కల్లాల్లో ధాన్యం కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం టార్పాలీన్ కూడా ఇవ్వలేదని అన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు 30 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఫసల్ భీమా యోజన కింద విధివిధానాలు తయారు చేసి వానాకాలం పంటకైనా సాయం చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం రేవంత్ , మంత్రులకు పాలనపై పట్టు దొరకలేదని వ్యాఖ్యలు చేశారు. మార్కెట్‌లో సీసీ టీవీలు పెడతామన్నారని.. ఎక్కడ పెట్టారని ప్రశ్నించారు. తేమ, తాలు పేరుతో తూకాల్లో తేడాతో రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి రివ్యూ మీటింగ్‌కు వ్యవసాయశాఖ మంత్రి పోలేదంటే వీరి పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఎంఎస్పీని అమలు చేయలేని అసమర్థ ప్రభుత్వం అంటూ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు వ్యాఖ్యలు చేశారు.

## విజయవాడ హైవేపై

# తరచూ రోడ్డు ప్రమాదాలు

మొదటిపేజీ తరువాయి..

వెంకటరెడ్డి అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈఎన్సీ గణపతి రెడ్డి, జాతీయ రహదారుల శాఖ అధికారులు పాల్గొన్నారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఎన్ హెచ్ 65పై 17 ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. ప్రాంతాల్లో అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్టు జాతీయ రహదారుల శాఖ గుర్తించింది. సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయడం, కొన్నిచోట్ల ఆరు లేన్లుగా రోడ్డు నిర్మాణం చేయడం, జంక్షన్ డెవలప్ మెంట్స్, ÷ఎజఖ (వెహికిల్ అండర్ పాస్)ల నిర్మాణం, రెండు వైపుల సర్వీస్ రోడ్ల నిర్మాణం వంటి చర్యలతో బ్లాక్ స్పాట్స్ ప్రాంతాల్లో ప్రమాదాలను నివారించాలని ప్రభుత్వం భావిస్తోంది. మంత్రితో సమావేశం అనంతరం ప్రమాదాల నివారణకు చేపట్టబోతున్న పనుల్లో స్పష్టత రానుంది.

ఈ రహదారిపై ఎక్కువ డ్యామేజ్ లు అయినట్లు అధికారులు మంత్రికి తెలిపారు. మొత్తం 17 బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని, వాటిని సంస్కరించేందుకు చర్యలు తీసుకునే అంశంపై ప్రధానంగా చర్చించినట్టు తెలుస్తోంది. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. అండర్ పాస్ లు ఉన్న ప్రదేశాల్లో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయమై అధికారులతో మంత్రి చర్చించారు. చిన్నపాటి వర్షానికే నగర రోడ్లు నదులను మరిపిస్తున్నాయి. దీని ప్రభావంతో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. కాలనీలు జలమయం అవుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి తీసుకోవాలల్సిన చర్యలపై అటు జీహెచ్‌ఎంసీ అధికారులతోనూ మంత్రి చర్చించారు. కొత్త రోడ్లు వేసే చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడుతూ ఉంది. దీనికి తోడు తాత్కాలికంగా వేసిన రోడ్లు డ్యామేజీ అవుతున్నాయి. వాటి మరమ్మతులకు తీసుకోవాల్సిన చర్యలపైనా మంత్రి రివ్యూ చేస్తున్నారు. ఈ సమావేశంలో ఈఎన్సీ గణపతిరెడ్డి, నాయ్ ఆర్వో రజక్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# కవితపై రాజకీయ దురుద్దేశ్యంతో కేసులు

మొదటిపేజీ తరువాయి..

బిఆరెస్, ఢిల్లీలో ఆప్ పార్టీని దెబ్బతీసే కుట్ర. లిక్కర్ పాలసీతో ఢిల్లీ ప్రభుత్వానికి లాభమే జరిగింది. బీజేపీ వంటకాన్ని వండి....సీబీఐ, ఈడీని ఆప్, బిఆరెస్ మీదకి వదిలింది. ఇలాంటి కేసులతో మమ్మల్ని భయబ్రాంతులకు గురి అవుతామనే భ్రమలో బీజేపీ నేతలు ఉన్నారు, కానీ భయపడే ప్రసక్తే లేదు. దేశంలో పాసిస్ట్ పాలన నడుస్తుంది. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఘోరంగా దెబ్బతిన్నది. బీజేపీ 220 సీట్లు దాటదు. వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే. ప్రతిపక్షాల నేతలను జైల్లో పెట్టి ప్రజాతీర్పును వారికి అనుకూలంగా మార్చుకునే ఎత్తుగడలకు ప్రజలు సరైన రీతిలో తీర్పు చెప్పనున్నారు. బీజేపీ కి వ్యతిరేకంగా ఎన్ని కేసులు పెట్టిన తలవంచకుండా పోరాటం చేస్తాం. మొండిగానే పోరాడుతామని కవిత చెప్పారు.

## మేం హ్యాట్రిక్ విజయం

# సాధించబోతున్నాం..

మొదటిపేజీ తరువాయి..

రాజకుమారుడు అఖిలేష్ యాదవ్ ఒక కొత్త ఆంటీ (మమతా బెనర్జీ) గొడుగు కింద చేరారు. ఆ కొత్త ఆంటీ పశ్చిమబెంగాల్‌లో ఉంది. మీకు బయట నుంచి మద్దతు ఇస్తామని ఆ కొత్త ఆంటీ ఇండియా కూటమికి చెబుతోందని మోదీ వ్యాఖ్యానించారు. దేశాన్ని మెరుగుపరచేందుకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఒకవైపు, దేశంలో అస్థిరత సృష్టించేందుకు ఇండియా కూటమి ఒకవైపు ఉందని, ఎన్నికలు నడుస్తున్న కొద్దీ ఇండియా కూటమి నేతలు ఒక్కొక్కరే కూటమి నుంచి జారిపోరుతున్నారని చెప్పారు. కేంద్రంలో రాబోయే కొత్త ప్రభుత్వంలో పేదలు, యువకులు, మహిళలు, రైతుల కోసం ఎన్నో పెద్దపెద్ద నిర్ణయాలు తీసుకోనున్నామని మోదీ చెప్పారు. జాతీయ ప్రయోజనాలకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే అంకితమైందని చెప్పారు. ఇండియా కూటమి నేతలు ప్రధానులవుతామంటూ పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. తాను 'హ్యాట్రిక్' కొట్టేందుకు, సమాజంలోని అన్నివర్గాల కోసం పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 500 ఏళ్ల తర్వాత రామాలయం కల సాకారమైందంటే దానికి ప్రజల ఓటు బలమే అందుకు కారణమని అన్నారు. రామమందిరంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తోసిరాజనేందుకు, మందిరంపై బుల్‌డోజర్ నడిపేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉన్నట్టు తమకు తెలిసిందని, న్యాయబద్ధంగా బుల్డోజర్ నడిపించడం ఎలాగో యోగి ఆదిత్యనాథ్ నుంచి కాంగ్రెస్ వాళ్లు తెలుసుకోవాలని సూచించారు. ఇండియా బ్లాక్‌కు ప్రజలు ఓటు వేసి అధికారం ఇస్తే, ఎస్సీ, ఎస్టీ, ఆదివాదీ, ఓబీసీల రిజర్వేషన్లను లాక్కొని తమ ఓటర్లకు ఇవ్వడం ద్వారా బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతుందని హెచ్చరించారు. ప్రధానమంత్రి యూపీలోని ఫతేపూర్, హమీర్‌పూర్‌లోనూ శనివారంనాడు బహిరంగ సభల్లో పాల్గొంటున్నారు.

# మానవత్వం మరచిన తనయులు

మొదటిపేజీ తరువాయి..


డబ్బుపై వ్యామోహం పెరిగి బంధుత్వాలు తగ్గుకుంటూ వస్తున్నాయి. ఆస్తి పాస్తులు ఉంటే చాలు తల్లి దండ్రులు కూడా అవసరం లేదని రుజువు చేస్తున్న ఘటనలు చూస్తున్నాం. తల్లిదండ్రులు తమ బిడ్డలను ఎంతో ప్రేమానురాగాలతో పెంచి పెద్ద చేస్తారు. కానీ చివరికి అలాంటి తల్లిదండ్రులని పట్టించుకోని దీన స్థితి నెలకొంది. బంగారం, డబ్బుల కోసం చివరకు చనిపోయిన తల్లి అంత్యక్రియలు నిర్వహించకుండా రెండు రోజులు రోజులు ఆపిన ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని కందులవారి గూడెం గ్రామంలో వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

కందులవారిగూడేనికి చెందిన వేము వెంకటరెడ్డి, లక్ష్మమ్మ (80) దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. గతంలోనే లక్ష్మమ్మ భర్త వెంకటరెడ్డి, చిన్న కుమారుడు కూడా చనిపోయారు . దీంతో నేరేడుచర్లలో ఉంటున్న చిన్న కుమార్తె వద్ద గత ఐదేళ్లుగా లక్ష్మమ్మ ఉంటుంది. లక్ష్మమ్మ ఇటీవల కాలు జారి కింద పడింది. దాంతో ఆమెను మిర్యాలగూడలోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు . ఆమె పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకెళ్లండని డాక్టర్లు సూచించారు. దీంతో లక్ష్మమ్మను ఆక్సిజన్ సపోర్ట్‌తో చిన్నకుమార్తె తన ఇంటికి తీసుకెళ్లింది. బుధవారం రాత్రి 9 గంటలకు ఇంటి ముందు ఉన్న వెంచర్ వద్ద అంబులెన్స్ వచ్చి ఆగింది. ఈలోగా లక్ష్మమ్మ కుమారుడు అక్కడికి చేరుకుని.. పెద్దమనుషులతో పంచాయితీ పెట్టించారు. లక్ష్మమ్మను కందులవారిగూడెం తీసుకెళ్తానని చెప్పడంతో.. మిగతా కూతుళ్ల ఆస్తి పంపకాలు తేలే వరకు అంబులెన్స్ కదిలేది లేదని పట్టుపట్టారు. చివరకు రాత్రి 11 గంటల సమయంలో లక్ష్మమ్మ కన్నుమూశారు. మృతదేహాన్ని కందులవారిగూడెం తరలించినా కొడుకు కూతుళ్ల పంచాయితీ మాత్రం ఆగలేదు. లక్ష్మమ్మ గతంలో రూ.21 లక్షల వరకు పలువురికి అప్పులిచ్చారు. ఆమె ఒంటిపై 20 తులాల బంగారు ఆభరణాలున్నాయి. అయితే లక్ష్మమ్మ వైద్య ఖర్చులు భరించిన చిన్నకూతురికి రూ.21 లక్షల్లోంచి రూ.6 లక్షలు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. మిగిలిన రూ.15 లక్షలకు సంబంధించిన పేపర్లను కుమారుడికి అప్పజెప్పారు. 20 తులాల బంగారు ఆభరణాలను ముగ్గురు కూతుళ్లు పంచుకున్నారు. అంతా అయిపోయిందిలే అనుకుంటున్నా సమయంలోనే కుమారుడు కొత్త పేచీ పెట్టాడు. తాను అంత్యక్రియల ఖర్చు భరించలేనని, తనకు డబ్బులిస్తేనే తలకొరివి పెడతానన్నాడు. శుక్రవారం ఉదయం పెద్ద మనుషులు అంత్యక్రియల ఖర్చుకు రెండు లక్షలు ఇప్పియడంతో ఆ పంచాయితీ కొలిక్కి వచ్చింది. తర్వాత ఆమె అంత్యక్రియలను నిర్వహించారు.

# అమేథీ నుంచే రాజకీయ ఓనమాలు

మొదటిపేజీ తరువాయి..

ఉంటానని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీలో కాంగ్రెస్, ఇండియా కూటమి అభ్యర్థి కేఎల్ శర్మ తరపున శుక్రవారంనాడు ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. రాహుల్‌తో పాటు అఖిలేష్ కూడా ప్రచారానికి హాజరయ్యారు. ఐదో విడత పోలింగ్‌లో భాగంగా మే 20న అమేథీలో పోలింగ్ జరుగనుంది. రాహుల్ తన ప్రసంగంలో 42 ఏళ్ల క్రితం తన తండ్రి రాజీవ్ గాంధీతో కలిసి అమేథీకి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాజకీయాల గురించి తాను ఏది నేర్చుకున్నా అది ఇక్కడి (అమేథీ) నుంచే నేర్చుకున్నానని, ప్రజలే తనకు నేర్పారని చెప్పారు. తాను తొలిసారి అమేథికి వచ్చిన సమయంలో అప్పుడు రోడ్లు కానీ, అభివృద్ధి కానీ లేదన్నారు. తన తండ్రికి, అమేథీ ప్రజలకు మధ్య ఉన్న ప్రేమానుబంధానికి తానే సాక్షినని చెప్పారు. తాను కూడా ఇదే తరహా రాజకీయాలను పాటిస్తున్నానని తెలిపారు. తాను రాయబరేలి నుంచి పోటీ చేస్తున్నప్పటికీ అమేథీతో మొదట్నించీ తనకున్న అనుబంధం చెక్కుచెదరదని, ఎప్పటికీ అమేథీ ప్రజల వెన్నంటి ఉంటానని చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికలు చాలా కీలకమని రాహుల్ తెలిపారు. ఒక రాజకీయ పార్టీ, ఆ పార్టీ నేతలు రాజ్యాంగాన్ని తిరగరాస్తామని, రాజ్యాంగాన్ని బుట్టదాఖలా చేస్తామని తొలిసారి చాలా స్పష్టంగా చెబుతున్నారని పరోక్షంగా బీజేపీని ఉద్దేశించి విమర్శించారు. రాజ్యాంగాన్ని చెరిపేద్దామా? రాజ్యాంగాన్ని తుడిచిపెట్టే శక్తి ఈ ప్రపంచంలో ఎవరికైనా ఉందా? అని ప్రజలను ఉద్దేశించి రాహుల్ ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని ప్రజలే పరిరక్షించుకోవాలని, రాజ్యాంగమే ప్రజా వాణి, ప్రజా భవిష్యత్తు అని స్పష్టం చేశారు. ఈ దేశంలో పేద ప్రజలకు ఏది చేసినా, రైతులకు సహాయపడినా, హరిత విప్లవం తెచ్చినా రాజ్యాంగంతోనే సాధించామని చెప్పారు. రాజ్యాంగానికి చరమగీతం పాడాలని నరేంద్ర మోదీ కోరుకుంటున్నారని, రాజ్యాంగం కనుమరుగైతే ఇక ప్రభుత్వ రంగమనేదే ఉండదని, ఉద్యోగాలు ఉండవని, ద్రవ్యోల్బణం తారాస్థాయికి చేరుకుందని, రిజర్వేషన్లకు స్వస్తి పలుకుతారని, ప్రజల హక్కులు ఒక్కొక్కటి



ఊడలాక్కుంటారని రాహుల్ హెచ్చరించారు. కేవలం ఎంపిక చేసిన 22-25 మంది కుబేరుల కోసం రైతులు, కార్మికులు, యువత, తల్లులు, సోదరీమణుల హక్కులను హరిస్తారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 140 సీట్లు సాధించడం కూడా కష్టమేనని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ అన్నారు. నాలుగు విడతల ఎన్నికలు పూర్తయ్యే సరికే బీజేపీ ఓటమిదశకు చేరుకుందన్నారు. వారి రథం మునకలేస్తోందని, 400 సీట్లు తమ లక్ష్యమని నినాదాలిచ్చినా ప్రజలు 140 సీట్లకే పరిమితం చేయనున్నారని చెప్పారు. రాజ్యాంగాన్ని, ప్రజల




హక్కులను మార్చాలనుకుంటున్న వారిని ప్రజలే మార్చాలనుకుంటున్నారని అన్నారు. అమేథీలో కాంగ్రెస్ అభ్యర్థిగా గాంధీ కుటుంబం విధేయుడుగా పేరున్న కిషోరి లాల్ శర్మ పోటీ చేస్తుండగా, బీజేపీ అభ్యర్థిగా కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, బీఎస్పీ అభ్యర్థిగా నాన్హె సింగ్ చౌహాన్ పోటీ పడుతున్నారు.

# రాజకీయాలకూ ఓ హద్దు ఉండాల్సిందే!

మొదటిపేజీ తరువాయి..

కేజ్రీవాల్ చర్యలను ఇప్పుడు సామాజికవేత్త అన్నాహజారే కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అవినీతికి అంటకాగే వారిని పాలన నుంచి దూరం పెట్టాలని పిలుపు నిచ్చారు. అయినా కేజ్రీవాల్ తన పద్ధతిని మార్చుకోలేదు. తన సిద్ధాంతానికి విరుద్ధంగా అవినీతి పార్టీలతో జతకట్టారు. ఆయన సిఎం కావడానికి ఉపయోగపడ్డ అవినీతి రహిత విధానాలను పక్కన పెట్టారు. మోడీని ఢీకొట్టాలి..ప్రధాని పదవిని చేపట్టాలన్న దుర్మార్గపు ఆలోచనతో అవినీతి ఊబిలో ఇరుక్కుపోయారు. లిక్కర్ కేసులో పీకల్లోతు కూరుకుపోయి..తీహార్ జైలుకు వెళ్లారు. అంతకుముందు ఇడి విచారణను కూడా ధిక్కరించారు. అయితే మోడీ ఎప్పటినుంచో కేజ్రీవాల్‌ను బొక్కలేయడానికి చూస్తున్నారు. ఎక్కడ దొరుకుతారా అని చూస్తున్నారు. ఇక లిక్కర్ కేసులో దొరకడం ఆలస్యం ఇడిని ప్రయోగించి బొక్కలో వేయించారు. ఎన్నికల్లో ఎక్కడా ప్రచారం చేయకుండా పోయిన తరుణంలో సుప్రీం దయతో కేజ్రీవాల్ బయటకు వచ్చారు. జూన్ 1న తిరిగి జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. ఇదంతా పూర్వ నేపథ్యం. ఇప్పుడు తాజాగా కొన్ని ఘటనలు చోటుచేసు కున్నాయి. కేజ్రీవాల్ జైలు నుంచి వచ్చాక ..ఓ కామెంట్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇక తాను జూన్1న తిరిగి జైలుకు వెళ్లాల్సిన అవసరం లేదని ప్రకటించారు. దీనిని తాజాగా ఇడి కూడా సుప్రీంలో సవాల్ చేసింది. అయితే ఈ వ్యాఖ్యలను పట్టించుకోబోమని కూడా సుప్రీం తేల్చింది. తాము అన్నీ ఆలోచించే బెయిల్ ఇచ్చామని చెప్పింది. ఇదే విషయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు కూడా ఇప్పుడు దుమారం రేపుతున్నాయి. ఒకప్పుడు గుజరాత్‌లో మంత్రిగా ఉన్న వ్యక్తి మోడీతో కలసి దేశంలో ఇప్పుడు చక్రం తిప్పుతున్నారు. హోంమంత్రిగా ఉన్న అమిత్ షా కేజ్రీవాల్ విషయంలో చేసిన వ్యాఖ్యలను సుప్రీం కూడా తప్పుపట్టేలా వ్యాఖ్యలు చేసింది. అధికారం, పార్టీ బలం చూసుకొని షా అదుపు లేకుండా మాట్లాడడం విస్మయానికి గురిచేస్తోంది. కేంద్రంలో బాధ్యత గల పదవిలో ఉంటూ దేశ ప్రధానికి కుడి భుజంగా పేరున్న అమిత్ షా ఏకంగా సుప్రీం కోర్టు ఆదేశాలు, తీర్పునే ప్రశ్నించే విధంగా మాట్లాడడం పట్ల న్యాయరంగ నిపుణులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలపై అమిత్ షా అడ్డగోలుగా వ్యాఖ్యలు చేయడం ఆయన అధికార అహానికి నిదర్శనంగా ఉందనే వ్యాఖ్యలూ వెల్లువెత్తుతున్నాయి. మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు వచ్చే నెల ఒకటో తేదీ వరకు పలు రకాల షరతులతో న్యాయమూర్తులు ఈ బెయిల్ మంజూరు చేశారు. అయితే, సుప్రీంకోర్టు కేజ్రీవాల్ ని ప్రత్యేకంగా చూసిందని అమిత్ షా వ్యాఖ్యానించడం ఆశ్చర్యానికి గురిచేసింది. దేశానికి హోంశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న నాయకుడు సుప్రీం ఆదేశాలను తప్పుపట్టే విధంగా మాట్లాడడం సమంజసం కాదనే అభిప్రాయాలు వస్తున్నాయి. ఢిల్లీ మద్యం కేసులో కొన్ని నెలలుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, తెర వెనుక రాజకీయ ఎత్తుగడలు దేశ ప్రజలకు తెలియని విషయం కాదని న్యాయ, రాజకీయ రంగ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలో కేజ్రీవాల్‌కు బెయిలు రావడంపై అమిత్ షాకు మింగుడు పడడం లేదనీ, అందుకే ఆయన అసహనాన్ని సుప్రీం కోర్టు తీర్పు పై వెళ్లగక్కుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఆప్ ఆధిపత్యాన్ని జీర్ణించుకోలేక అమిత్ షా సహనం కోల్పోయి మాట్లాడడం కేవలం అధికార అండతో బెదిరించడమే అనే విమర్శలూ వస్తున్నాయి. రాజకీయ నాయకులు ఇలా కోర్టు అనుమతులు, ఆదేశాలు, తీర్పుల వ్యవహారాల్లో జోక్యం చేసుకొని న్యాయవ్యవస్థను చులకన పరిచే విధంగా మాట్లాడితే సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందనే వాదనలు తెరపైకి వస్తున్నాయి. అయితే ..ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన విషయంలో తామేమీ ప్రత్యేక మినహాయింపు ఇవ్వలేదని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఎవరికీ ఎలాంటి మినహాయింపు ఇవ్వలేదు. ఏది న్యాయసమ్మతమని భావించామో దానిని మేం మా తీర్పులో స్పష్టం చేశాం' అని తెలిపింది. తాత్కాలిక బెయిల్ అంశంలో కేజ్రీవాల్‌కు కోర్టు ప్రత్యేక ట్రీట్‌మెంట్ ఇచ్చిందని దేశంలో పలువురు భావిస్తున్నారంటూ కేంద్ర హోంమంత్రి, బీజేపీ కీలకనేత అమిత్‌షా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ విధంగా స్పందించింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈడీ తనను అరెస్టు చేయటాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దీపంకర్‌దత్తాలతో ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. అమిత్‌షా పేరు ప్రస్తావించకుండా ఆయన చేసిన వ్యాఖ్యలను ఉదహరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. తాము ఆ అంశంలోకి వెళ్లదల్చుకోలేదని చెబుతూనే, ఎవరికీ ఎలాంటి మినహాయింపు ఉండబోదని తెలిపింది. అయితే, తీర్పుపై విమర్శనాత్మక విశ్లేషణను తాము స్వాగతిస్తామని ధర్మాసనం పేర్కొనటం విశేషం. సుప్రీం కేజ్రీవాల్‌కు క్లీన్ చిట్ ఇవ్వలేదు. కేవలం తాత్కాలిక బెయిల్ మాత్రమే ఇచ్చింది. అదికూడా కేసులో ఉన్న మెరిట్స్‌ను పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకుంది. దీనిపై రాజకీయాలు ఎలా ఉన్నా సుప్రీం నిర్ణయాన్ని తప్పుపట్టరాదు. అది అమిత్ షా కావచ్చు..మరెవరైనా కావచ్చు...ఇది గమనించాలి.


# మిషన్ భగీరథ పేరుతో అతిగా ప్రచారం

## ఫ్లోరైడ్ ప్రాంతాలకు నేటికీ కలగని విముక్తి


## నక్కలగండి పూర్తయినే ఈ ప్రాంతానికి మోక్షం

**నల్లగొండ,మే17(నమస్తే ఉదయం):**

మిషన్ భగీరథ పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చివుంటే ఈ పాటికి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైబ్ భూతం అదుపులోకి వచ్చేది. కానీ బిఆర్ఎస్ పథకం ఆచరణ కన్నా ఆర్భాటపు ప్రచారానికి ప్రాధనాయం ఇచ్చింది. మిషన్ భగీరథతో నల్లగొండ ఫ్లోరైడ్‌ను తరిమికొట్టామని అబద్ధాలు అతిగా ప్రచారం చేశారు. నిజానికి శు ద్ధ జలం పంపిణీ జరిగితే తప్ప ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ నివారణ జరిగేలా కనిపించడం లేదు. ఇంటింటికి నీరు వస్తేనే ఇది దూరం అవుతుంది. భూగర్భ జలాల వినియోగం తగ్గితేనే ఇది సాధ్యం కాగలదు. శాశ్వత కరువు, ఫ్లోరోసిస్ నివారణకు కృష్ణా జలాలు అందించాలన్న పథకం ముందుకు సాగక పోవడంతో ఫ్లోరైడ్ గ్రామాలకు శాప విమోచనం కలగలేదు. జిల్లాలోని దేవరకొండ, మునుగోడు ప్రాంత ప్రజలు ఫ్లోరైడ్‌తో పోరాడుతున్నారు. ఫలితంగా నక్కలగండి ఎత్తిపోతల ద్వారా కృష్ణా జలాలు అందించనున్నట్టు గత ప్రభుత్వం ప్రకటించి, ముప్పై లక్షలు కేటాయించింది. కానీ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తి చేయకపోవడంతో ప్రజలకు మంచినీటి లక్ష్యం నెరవేరలేదు. శ్రీశైలం ఎడమగట్టు సొరంగం పథకాన్ని చేపట్టి గ్రావిటీ ద్వారా 30 టీఎంసీల నీరు నల్గొండ జిల్లాలో అదనంగా మూడు లక్షల ఎకరాలకు సాగునీరు, 700 గ్రామాలకు తాగునీరు అందించాలని జిల్లా ప్రజలు ఆందోళన చేపట్టారు. దీంతో గతంలో నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా శ్రీశైలం కుడి, ఎడమ కాల్వలకు శంకుస్థాపన చేశారు. అయితే కుడి కాలువ పనులు పూర్తయ్యాయి. ఎడమ కాలువ పనులు మాత్రం నత్తనడకన సాగాయి. ఎస్ఎల్‌బీసీని పెండింగ్‌లో పెట్టి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టడం జరిగింది. శ్రీశైలం సొరంగం పథకాన్ని చేపట్టాలన్న జిల్లా ప్రజల ఆందోళనతో అనుమతిచ్చారు. అందులో రెండు టన్నల్స్‌కు 1950 కోట్లతో ఇపిసితో టెండర్ పిలిచి జేపీ అసోసియేషన్స్ వారితో ఒప్పందం జరిగింది. దీన్ని నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉండగా, ప్రభుత్వం నిధులు కేటాయించనందున



పూర్తికాలేదు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే యాభై ఏళ్లు గడిచినా ఈ ప్రాజెక్టు పూర్తికాదు. కాబట్టి తక్షణమే పూర్తిచేసి అందులో అంతర్భాగమైన నక్కలగండి (లోయర్‌డిండి) రిజర్వాయర్ పనులను వెంటనే ప్రారంభించాలి.ఈ పథకంలో ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం ద్వారావచ్చే నాలుగువేల క్యూసెక్కులలో మూడువేల క్యూసెక్కులను దిగువ డిండి (నక్కలగండి) జలాశయం నుంచి రెండు స్టేజీలలో ఎగువ డిండికి 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి 3.4 లక్షల ఎకరాలకు సాగునీరందించే సౌకర్యం ఉన్నది. శ్రీశైలం సొరంగ మార్గం ద్వారా వచ్చే నీటిని నక్కలగండి (చందంపేట మండలం) వద్ద 7. టీఎంసీల సామర్థ్యంతో లోయర్ డిండి రిజర్వాయర్‌ను ఏర్పాటు చేస్తారు. అక్కడి నుంచి ఎడమ కాలువ ద్వారా ఏఎమ్మార్పీకి సరఫరా చేస్తారు. గోనబోయినపల్లి సమీపంలోని మేళ్లచెరువును మిడ్ డిండి రిజర్వాయర్‌గా 11 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తారు. మిడ్ డిండి నుంచి 12.75 కిలోమీటర్ల సొరంగం ద్వారా పంప్‌హౌస్‌కు నీటిని విడుదల చేసి, అక్కడి నుంచి 560 మీటర్ల పొడవు, మూడుమీటర్ల వ్యాసార్థం కలిగిన ఆరు పైపుల ద్వారా 134 మీటర్ల ఎత్తు నుంచి అప్పర్ డిండికి సరఫరా చేస్తారు. ప్రస్తుత డిండి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 7.2 టీఎంసీలకు పెంచుతారు. మధ్య డిండి రిజర్వాయర్ నుంచి .7 కిలోమీటర్ల పొడవు కాల్వలు తవ్వుతారు. ఈ కాలువకు మధ్యలో కాసారం, దేవరకొండ, సామలపల్లి గ్రామాల వద్ద 7 టీఎంసీల సామర్థ్యంతో మూడు రిజర్వాయర్లు నిర్మిస్తారు. ఇవేగాక మైనంపల్లి, ఉప్పువాగు, నాంపల్లి, ఇర్విన్ వద్ద కూడా రిజర్వాయర్లు ఏర్పాటు- చేస్తారు. మిడ్ డిండి ద్వారా డిండి, దేవరకొండ, చందంపేట, గుర్రంపోడ్, ఉప్పువాగు, నాంపల్లి,
మునుగోడు, చండూరు, కనగల్లు, నల్గొండ మండలాలలో సుమారు 90,500 ఎకరాలు, అచ్చంపేట మండలంలో 1000 ఎకరాలకు సాగునీరు అందుతుంది. నల్గొండ జిల్లాలో పశ్చిమ భాగంగా ఉన్న దేవరకొండ, మునుగోడు, నల్గొండ నియోజక వర్గాల్లో 14 కరువు పీడిత మండలాలలో మహబూబ్‌నగర్ జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని ఐదు మండలాల్లో సాగు, తాగునీరు అందించే ఈ పథకానికి ప్రణాళిక చేశారు. దీనిపై ఇప్పటికైనా సిఎం రేవంత్ రెడ్డి శ్రద్ధ పెట్టాల్సి ఉంది.



# నేడు విద్యుత్ లేని ప్రాంతాలు

**రాజేంద్రనగర్, మే 17(నమస్తే ఉదయం):** నేషనల్ పోలీస్ అకాడమీ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన రాఘవేంద్ర కాలనీ, అలీబై మజీద్ ప్రాంతం, శాస్త్రి పురం ప్రాంతాలలో శనివారం ఉదయం 8:30 నుండి 9 గంటల వరకు సరఫరా నిలిపిస్తున్నట్లు ఆయన పేరు కొన్నారు.

### మైలార్ దేవ్‌పల్లి సెక్షన్ పరిధిలో...

బండ్లగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 7:30 నుండి 8 గంటల వరకు వినాయక నగర్, అయేషా కాలనీ, అలీ నగర్ అహ్మద్నగర్ కింగ్స్ అవెన్యూ , రహమత్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుండి 8:30 గంటల వరకు తులసి నగర్ వాదే ఈ ఫర్హాన్, సుభాన్ హిల్స్ క్రిస్టల్ టౌన్ రహమత్ కాలనీ హాశామాబాద్, దుర్గా నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 8:30 నుండి 9 గంటల వరకు వినాయక నగర్, దుర్గా నగర్ ,పైనీర్ పాఠశాల ప్రాంతం, గణేష్ నగర్, శాంతినగర్, ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

### హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో...

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని పి అండ్ టీ కాలనీ, మిలిటరీ 2, హైదర్ షాకోట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం సరఫరాలో అంతరాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలైన మ్యాపుల్ టౌన్, పి అండ్ టీ కాలనీ, ఏ బి సి డి బ్లాక్, పద్మ శ్రీ హిల్స్, ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించగలరని ఆయన కోరారు.

### మణికొండ పరిధిలో..

### నేడు విద్యుత్తు లేని ప్రాంతాలు

గండిపేట మండలంలోని గండిపేట , బృందావన్ కాలనీ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 6 నుండి 6:30 వరకు, గండిపేట, బృందావన్ కాలనీ, జిల్లా గ్రీన్ ప్రాంతాలలో... ఔటర్ రింగ్ రోడ్డు విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 6:30 గంటల నుండి 7 గంటల వరకు మంగల్ గడ్డ, ఓ ఆర్ ఆర్ సర్వీస్ రోడ్... వట్టి నాగులపల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం ఏడున్నర నుండి 8 గంటల వరకు వట్టినాగులపల్లి గ్రామం, వివేకానంద నగర్ విద్యుత్, వీరభద్ర ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8:30 నుండి 9 గంటల వరకు వివేకానంద నగర్ నర్సింగ్ హైట్స్, క్యూబా మజీద్ కాలనీ, సజ్జన్ సింగ్ లేఅవుట్, శ్రీనగర్, గ్రే హౌండ్స్, ఈ ఐ పి ఎల్ విల్లాస్ బాబు ఖాన్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుండి 8 గంటల వరకు ఓజీఎం, బాబు ఖాన్ విల్లాస్, దంతు స్ట్రీట్, ప్రైవేటు విల్లా, నియో పోలీస్ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సందీప్ రెడ్డి తెలిపారు...

**ఇబ్రహీం భాగ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో...** ఇబ్రహీం భాగ్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని మణికొండ పుప్పాలగూడ సెక్రటేరియట్ కాలనీ పంచవటి కాలనీ, శివాజీ నగర్, అల్కాపురి లాంగ్వేజ్ ప్రాంతాలలో ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరానికి సహకరించగలరని ఆయన కోరారు.

# మణికొండలో విషాదం...

## సీరియల్ నటుడు చంద్రకాంత్ ఆత్మహత్య.

**హైదరాబాద్, మే17(నమస్తే ఉదయం):**
సీరియల్ నటుడు చంద్రకాంత్ మణికొండ లో తాను నివాసం ఉంటున్న ఇంట్లో ఫ్యాన్ కు ఉరి వేసుకుని శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు.
అల్కాపూర్ కాలనీ లో ఈ సంఘటన జరిగింది.
విషాదంలో మునిగిపోయి కుటుంబ సభ్యులు.
పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలింపు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న నార్సింగ్ పోలీసులు.



## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల

# పనులు సకాలంలో పూర్తి చేయాలి




**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 17(నమస్తే ఉదయం):**
ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మౌలిక వసతుల పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు.

శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలచే అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, ముసిని వెంకటేశ్వర్లుతో కలిసి ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ,

అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన కనీస మౌలిక వసతుల అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని, పాఠశాలలను పున ప్రారంభించేందుకు మనకు మరో 20 రోజుల గడువు మాత్రమే ఉందని, ఆ లోగా మంజూరు చేసిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేసి పాఠశాలను ప్రారంభించేందుకు సన్నద్ధం కావాలని సిఎస్ కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో బాలికల సంఖ్య ప్రకారం తప్పనిసరిగా ప్రత్యేకంగా టాయిలెట్లు ఉండాలని, వీటిని అత్యంత ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల స్కూలు యూని ఫామ్ జిల్లాలకు చేరుతున్నాయని, ఇప్పటి వరకు 17 జిల్లాలకు బట్టలు చేరాయని, మరో 3 రోజులలో మిగిలిన జిల్లాలకు యూనిఫామ్ బట్టలు చేరతాయని సిఎస్ తెలిపారు.

జిల్లాలో కుట్టు మిషన్లలో అనుభవం కలిగిన స్వశక్తి మహిళా సంఘాలకు సభ్యులను గుర్తించి స్కూల్ యూనిఫాంలు కుట్టే ఆర్డర్ అందించాలని సి.ఎస్. కలెక్టర్లకు సూచించారు. పాఠశాలలు పున ప్రారంభానికి ముందే విద్యార్థులందరికీ తప్పనిసరిగా యూనిఫారం లు అందించే విధంగా సన్నద్ధమయ్యేలా రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని సీఎస్ సూచించారు.

ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం లక్ష్యంగా మే చివరి నాటికి ధరణి పెండింగ్ దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, ధరణి దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్లు రెగ్యులర్ గా తహసిల్దారులతో సమావేశం నిర్వహించి గ్రామాల వారీగా పెండింగ్ సమస్యలను పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన మార్పులు ధరణి మాడ్యుల్స్ లలో చేయడం జరిగిందని సీఎస్ తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులలో అధికంగా రెవెన్యూ, ధరణి సంబంధిత సమస్యలు అధికంగా వస్తున్నాయని, వీటిని ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో జూన్ 7 వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిలిపివేశామని, ప్రజావాణి కార్యక్రమం పునః ప్రారంభానికి ముందే పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సీఎస్ అన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా మద్దతు ధరపై కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని, మిల్లుల వద్ద ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేదని, అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో పెట్టాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా సత్వరమే కొనుగోలు జరిగేలా చూడాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న లిజిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్ మాట్లాడుతూ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా కనీస మౌలిక సదుపాయాలైన టాయిలెట్లు, త్రాగు నీరు, చిన్న చిన్న రిపేర్ల పనులు పూర్తి చేస్తున్నామని, చేసిన పనులను నమోదు చేసి సకాలంలో బిల్లులు చెల్లింపులు చేస్తున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి, సకాలంలో రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నామని తెలిపారు. సీఎంఆర్ రైస్ మిల్లింగ్ ప్రక్రియ పూర్తయిందని, త్వరితగతిన డెలివరీ పూర్తి చేస్తామని అన్నారు.

ఈ సమావేశంలో ఆర్డీవో రామచందర్, డి ఆర్ డి ఓ నర్సింగ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఇందిర, పంచాయతీరాజ్ ఈ ఈ విజయ్ కుమార్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ విమల తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుకై అలుపెరగకుండా శ్రమించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు....

**- ఎమ్మెల్యే అరికపూడి గాంధీ...**

**కూకట్‌పల్లి,మే 17 (నమస్తే ఉదయం):**
పార్లమెంట్ ఎన్నికల ముగిసిన తదనంతరం ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మహిళనాయకులు, కార్యకర్తలు, ,అభిమానులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంతో అత్యంత కీలకమైన ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకున్న నియోజకవర్గ ఓటర్లతో పాటు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు, నాయకులకు, కార్యకర్తలకు బీఆర్ఎస్ అభిమానులకు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన స్వల్ప కాలంలోనే పార్లమెంటు ఎన్నికలు వచ్చినప్పటికీ తనకు అఖండ మెజార్టీ అందించటమే కాకుండా.. బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుకోసం నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు తామే అభ్యర్థిలా భావించి అలుపెరగకుండా శ్రమించారని ఎమ్మెల్యే



గాంధీ వారిని అభినందించారు. రాజకీయ పరంగా ఎన్నో పరిణామాలు చోటు చేసుకున్నా నిజమైన నిఖార్సయిన గులాబీ శ్రేణులెవరూ ఆత్మస్థైర్యం కోల్పోకుండా ప్రజా క్షేత్రంలో నిలబడి అవిరళ, నిర్విరామంగా కృషి చేసారన్నారు. పదేండ్ల కాలంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లటంలో, ఓటర్లను చైతన్య పరచటంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల కృషి స్ఫూర్తి దాయకమని ఆయన పేర్కొన్నారు. కార్యకర్తలే ఎప్పటికయినా పార్టీకి బలమని, బలగమని గులాబీ సైనికులు ఈ ఎన్నికల ద్వారా మరోసారి నిరూపించారని ఈ సందర్భంగా నియోజకవర్గ, డివిజన్, కాలనీ , బూత్ స్థాయి నేతలు, మహిళా కార్యకర్తలకు ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మున్ముందు ఎన్నికలలోనూ ఇదే స్ఫూర్తిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మహిళ నాయకురాలు మంజుల, స్వప్న, బీజాన్ బీ, ఎస్ కే బీబీ, గణిత, సరస్వతి, రమాదేవి, చంద్రకళ, లక్ష్మమ్మ, లక్ష్మీ, రాణి, నీలా, లావణ్య, నిర్మల, లత, భారతమ్మ, లక్ష్మీదేవి, లలితమ్మ, చంద్రకళ, దుర్గాభవని, స్వరూప మరియు తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారులకు నిరంతర విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం...

**- ఏడిఈ సత్యనారాయణ**



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏడిఈ సత్యనారాయణ

**బండ్లగూడ, మే17(నమస్తే ఉదయం):**
విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా అందజేస్తున్నామని రాజేంద్రనగర్ విద్యుత్ సబ్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సత్యనారాయణ తెలిపారు. టి ఎస్ ఎస్ పి డి సి ఎల్ సి ఎం డి ముషారఫ్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి విధి నిర్వహణలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి అంతరాయం లేకుండా సరఫరా అందించేందుకు ఆయన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఈ సత్యనారాయణ మాట్లాడుతూ... విద్యుత్ అధికారులు, సిబ్బంది ఎండనక, వాననక విద్యుత్ వినియోగదారులకు సేవలు అందిస్తున్నారన్నారు. యాజమాన్యం సూచనల మేరకు పనిచేస్తూ వినియోగదారుల సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ ప్రాంతాలలో ఉన్న విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని వాటిని వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హిమాయత్ సాగర్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, జేఎల్ఎం సత్యం, ఆర్టిజన్‌లు పాల్గొన్నారు.





ప్రభాత ఉదయం
మేనేజింగ్ డైరెక్టర్
మేకల దామోదర్ రెడ్డికి
జన్మదిన
శుభాకాంక్షలు



## గగన్ పహాడ్ ఏ1 ప్లాస్టిక్ కంపెనీ గదిలో
# ఓ కార్మికుడు ఆత్మహత్య

**రాజేంద్రనగర్, మే27(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ మండలం కాటేదాన్ క్లస్టర్ పారిశ్రామిక ప్రాంతంలోని గగన్ పహాడ్‌లో అనుమానాస్పదనంగా ఓ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏ వన్ ప్లాస్టిక్ పరిశ్రమలో పనిచేసే ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కరుణ బాసర(30) ఈ మధ్యకాలంలోనే వివాహం చేసుకొన్నాడు. కుటుంబాన్ని పోషించడం కోసం గత ఆరు నెలల కిందట నుంచి పరిశ్రమంలో పనిచేస్తున్నాడు. పరిశ్రమకు సంబంధించిన గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం జరిగింది . ఈ ఘటన తెలుసుకున్న సిఐటియు కాటేదాన్ క్లస్టర్ కోశాధికారి భాస్కర్, సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్ సంఘటన స్థలానికి వెళ్లి కార్మికుడు చనిపోయిన స్థలాన్ని సందర్శించడం జరిగింది. చనిపోయిన కార్మికుడు కు సంబంధించిన కుటుంబ సభ్యులు ఎవరు ఇక్కడ లేరు. పరిశ్రమ యజమానిని వివరణ కోరగా, కార్మికుడు విధులు నిర్వహించి తన గదిలో రెస్ట్ తీసుకుంటానని గురువారం వెళ్ళాడు అంతకు మించి నాకేం తెలియదు అని చెప్పడం జరిగింది . కార్మికుడు చనిపోయిన పరిస్థితి చూస్తే అతడు రెండు కాళ్లు భూమికి ఆనుకొని ఉన్నాయి . ఒకవేళ ఊరిపెట్టుకున్నట్లయితే కాళ్లు భూమికి అనకుండా ఉంటాయి. ఇదే విషయాన్ని యజమానిని ప్రశ్నించడం జరిగిందని సీఐటీయూ నాయకులు తెలిపారు. పోలీసులు కేసును దర్యాప్తు చేయాలని కోరడం జరిగిందన్నారు. మృతుని కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత కార్మికుడికి న్యాయం చేస్తానని పరిశ్రమ యజమాని చెప్పడం జరిగింది కార్మికుని మృత దేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించిన శంషాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




## ఎంఐఎం నాయకుడు యాసర్ అరాఫత్‌పై
# చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**- కొంగళ్ళ నవీన్ అడ్వకేట్**

**రాజేంద్రనగర్, మే 17(నమస్తే ఉదయం):** ఏఐఎంఐఎం నాయకుడు, యాకుత్పురా నియోజకవర్గం ఇంచార్జి యాసర్ అరాఫత్ , అతని అనుచరులపై సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ లో బిజెపి నాయకులు, వాది ఫిర్యాదు కొంగళ్ల నవీన్ చేశారు . శుక్రవారం సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ లో ఇన్స్పెక్టర్ ని కలిసి 13 న జరిగిన పార్లమెంట్ ఎలక్షన్ లో భాగంగా హైదరాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి మాధవి లతా ని ఎంపీ అభ్యర్థి అని కూడ చూడకుండా ఇష్ట రాజ్యాంగ దుర్భాషలాడాడని ఫిర్యాదు పత్రంలో పేర్కొన్నారు. మహిళ అయిన మాధవీలత పై పై కి వచ్చి ఇష్టమొచ్చినట్లు యాసర్ అరాఫత్ , అతని అనుచరులు 100 మందికి పైగా వచ్చి తిట్టారన్నారు.

ఆ రోజు సాయంత్రం 3 గంటల సమయంలో యాకుత్ పురలో జరిగింది, అక్కడ పోలింగ్ కొనసాగుతున్న సమయంలో 144 సెక్షన్ ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా గుంపులు గుంపులుగా పోలింగ్ బూత్ లోకి వెళ్ళి రిగ్గింగ్ కూడా చేసారన్నారు. హైదరాబాద్ ఎంపీ బిజెపి అభ్యర్థి మాధవీలత గెలుస్తారు అని భయంతో ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నా రన్నారు. ఎంఐఎం గుండాలు ,ఇందుకు భాగంగా అరాఫత్ ,అతని అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఇన్స్పెక్టర్ శ్రీనివాస చారి ని కోరారు . ఫిర్యాదు చేసిన వారిలో జీత్ జైశ్వాల్ , ఓం సింగ్ ,కాంచన జోషి , ప్రాచి జైన్, అనిల్ బజాజ్ పాల్గొన్నారు.


ఎంఐఎం నాయకుడుపై ఫిర్యాదు చేస్తున్న నవీన్

## యువత మంచి మార్గాన్ని ఎంచుకోవాలి.....
## సమాజా నిర్మాణానికి మొదటి మెట్టుగా నిలవాలి...

**కూకట్‌పల్లి,మే 17 (నమస్తే ఉదయం):** నవ సమాజ నిర్మాణానికి కీలక పాత్ర యువతే అని, సమాజంలో ప్రత్యేక గుర్తింపు యువతకు మాత్రమే ఉంటుందని, శ్రీ కృష్ణ యూత్ 1998సం నుంచి సమాజ నిర్మాణానికి మరియు ప్రజలకు మేలు చేసే విధంగా శ్రీ కృష్ణ యూత్ కార్యాలయం ఏర్పాటు చేసి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని వ్యవస్థాపకులు వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శుక్రవారం నల్లగండ్ల గ్రామంలోని శ్రీ కృష్ణ యూత్ కార్యాలయంలో శ్రీ కృష్ణగౌడ్ 52వ జయంతిని పురస్కరించుకుని గ్రామ సభ్యులు, యూత్ సభ్యులు, నియోజకవర్గ నాయకులతో కలిసి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, బాలరాజు ముదిరాజ్, శ్రీ కృష్ణ యూత్ ప్రెసిడెంట్ ఆదిత్య ముదిరాజ్, మాజీ అధ్యక్షులు ప్రదీప్, భాస్కర్, జయ సాయి, సభ్యులు మధు యాదవ్, శివనంద్ రెడ్డి, సాయిరాజ్,సతీష్, నియోజకవర్గ నాయకులు రామారావు, చంద్రా రెడ్డి, రాజీ రెడ్డి, గోపాల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీ కృష్ణ యూత్ వ్యవస్థాపకులు, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్

# త్వరలో కేబినెట్ విస్తరణ?

**బీసీ సామాజిక వర్గానికి చెందిన వీర్లపల్లి శంకర్**

**మంత్రి పదవికి సమర్ధుడు వీర్లపల్లి శంకర్**

**షాద్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేకు మంత్రి పదవి దక్కాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నా కార్యకర్తలు అభిమానులు**



**షాద్ నగర్, మే17(నమస్తే ఉదయం):** అసెంబ్లీ సమావేశాల్లోపు మంత్రి వర్గ కేబినెట్ విస్తరించాలని సీఎం రేవంత్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల సమాచారం మేరకు బీసీ,ముదిరాజ్,మైనారిటీ వర్గాలతో కలిపి నలుగురికి మంత్రులుగా అవకాశామివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యోచిస్తున్నట్టు సమాచారం.ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల వారికి ప్రాధాన్యమిచ్చే అవకాశం ఉంది.అయితే షాద్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బడుగు బలహీన వర్గాల నుండి తొలి సరిగా అసంబ్లీలో అడుగు పెట్టి ప్రజల కోసం అనునిత్యం సమస్యలు పరిష్కారం చేస్తూ ప్రజల మధ్య ఉంటున్నారు.మంత్రి వర్గ విస్తరణలో షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్ కు మంత్రివర్గంలో చోటు దక్కలని షాద్ నగర్ కు చెందిన పార్టీ సీనియర్లు కార్యకర్తలు,అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో మరో కీలక వ్యక్తి అరెస్ట్ రిమాండ్

**బతికుండగానే మరణించినట్టు ధ్రువపత్రాలు సృష్టించిన ఘనులు**

**జంగయ్యను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపిన పోలీసులు**

**జంగయ్యను తిరుపతిలో అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం**

**తహశీల్దార్ అరెస్టుకు బ్రేకెందుకు...?**

**మిగతా వారిని అరెస్టు చెయ్యకపోడంపై అనుమానం వ్యక్తం చేస్తున్నా మండల ప్రజలు**

**ఆ తాహాశిల్దార్ ను అరెస్ట్ చేస్తారా. !**

**9మంది పై ఎఫ్ఐఆర్ గతంలో ఇద్దరు మహిళలు అరెస్ట్ రిమాండ్.!**

**నేడు కీలక వ్యక్తి జంగయ్య అరెస్ట్ రిమాండ్..!**



**షాద్ నగర్,మే 17(నమస్తే ఉదయం):** రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరి గూడ మండలంలో ఓ రైతు బ్రతికుండగానే చనిపోయాడని ఫేక్ డెత్ సర్టిఫికెట్ సృష్టించి ఆ రైతు భూమిని మరొకరికి విరాసత్ చేసిన ఘటనలో గడ్డం వెంకటయ్య పిర్యాదు మేరకు...రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడా మండలంలో గతంలో తహసశిల్దారుగా పనిచేసిన విజయ్ కుమార్ తో పాటు 8 మంది పై చౌదరిగుడా మండల పోలీసులు కేసులు నమోదు చేశారు వారిపై 420,419,467,468,471,34 ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు ఈ కేసులో కేవలం ఇద్దరు మహిళలను మాత్రమే అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.మరో నిందితుడిగా ఉన్న

జంగయ్యను తిరుపతిలో అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.ఇప్పటివరకు ఆ తహశీల్దార్ ను మాత్రం అరెస్టు చెయ్యలేదు.దీనిపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

చౌదరిగుడా మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన గడ్డం వెంకటయ్యకు సర్వే నెంబర్ 222/3 లో 20 గుంటల సీలింగ్ పట్టా,16/26/2లో 10 గుంటల భూమి ఉంది గత కొన్ని రోజులుగా రైతుబంధు డబ్బులు రాకపోవడంతో అధికారులను కలిశాడు రైతు వెంకటయ్య అసలు భూమే తన పేరు మీద నుండి మరొకరికి విరాసత్ అయినట్టు అధికారులు చెప్పడంతో దానికి తోడు రైతు వెంకటయ్య మరణించినట్లు ధృవీకరణ పత్రాలు జత చేసి 30 గుంటల భూమిని వేరే వ్యక్తుల పేరిట అధికారులు విరాసత్ చేసి పట్టా మార్పిడి చేశారని తేలడంతో రైతు వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇద్దరు మహిళలైనా గాయత్రి,మమత ను అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు.

శుక్రవారం మరో వ్యక్తి జంగయ్యను అరెస్ట్ చెయ్యగా తహశీల్దార్‌ను ఎందుకు అరెస్టు చేసి రిమాండ్ చేయ్యడం లేదనే నియోజకవర్గ స్థాయిలోను విమర్శలు మాత్రం పెద్ద ఎత్తున వ్యక్తం అవుతున్నాయి.

అయితే ఈ కేసులో తహశీల్దార్‌తో పాటు షాద్ నగర్‌కు చెందిన ఓ న్యాయవాది కూడా ఉండడం మరిన్ని విమర్శలకు దారి తీస్తుందన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**- గద్వాల జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్**


**గద్వాల జిల్లా ప్రతినిధి, మే17(నమస్తే ఉదయం):** జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు.

శుక్రవారం గద్వాల్ మండల పరిధిలోని బీరెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముసిని వెంకటేశ్వర్లు తో పాటు జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బి ఎం సంతోష్ మాట్లాడుతూ... రైతులు పండించి తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం సేకరించాలన్నారు. రైతులకు అక్కడ ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలున్నా రైతులు తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కారిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కేంద్రాలకు వచ్చిందని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం గిడ్డంగుల రవాణా, రైతుల సాగు ధ్రువీకరణ పత్రాలు, కొనుగోలు , చెల్లింపు, గన్ని సంచులు , తదితర రిజిస్టర్ లను కలెక్టర్ పరిశీలించారు.

అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు లత్తిపురం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ నర్సింగరావు, పౌర సరఫరాల శాఖ డీ.ఎం విమల, గద్వాల ఎం.పీ.డీ.వో ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు



**- గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 17(నమస్తే ఉదయం):** ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ అధికారులకు ఆదేశించారు.

శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి మద్యాహ్నం 12గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు జరుగుతునట్లు తెలిపారు. పరీక్షలలో ఎటువంటి మాస్ కాపీలు జరగకుండా ఫ్లేయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ లను నియమించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పోలీస్ శాఖ వారు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలనీ, జిరాక్స్ కేంద్రాలని మూసివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ప్రధమ చికిత్స అందించుటకు ఏ ఎన్ ఎం లను ఏర్పాటు చేయాలని వైద్య అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ వారికి సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. జిల్లాలో 3,664 మంది విద్యార్థులు 09 పరీక్ష కేంద్రాలలో రాస్తునట్లు తెలిపారు. విద్యార్థులతో పాటు సిబ్బంది కేంద్రాల్లోకి సెల్ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావొద్దని సూచించారు. సమీక్ష సమావేశంలో ఆర్.డి.ఓ రామ్ చందర్ ,డి.ఎస్.పి కే.సత్యనారాయణ, ఇంటర్మీడియట్ అధికారి హృదయ రాజు , డిప్యూటి డి.ఎం.హెచ్ .ఓ సిద్దప్ప , తదితరులు పాల్గొన్నారు.

**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. “RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.